ఇంకెన్నాళ్లీ గేటు కష్టాలు


గేటువద్ద ఆగిన వాహనాలు

- పెరిగిన రైళ్ల రాకపోకలు
- కనిపించని ప్రత్యామ్నాయ మార్గం
- సాకారం కాని అండర్ బ్రిడ్జి నిర్మాణం

నగరి: రైలు గేటు పడిందా.. అంతే సంగతి. పెరిగిన రైళ్ల రాకపోకలతో ప్రతి అరగంటకు ఒకటి, రెండు సార్లు రైల్వే గేట్లు పడిపోతున్నాయి. రైలు వచ్చే ముందు ఒక పావుగంట, రైలు గేటు దాటి వెళ్లి.. సిగ్నల్ దాటే వరకు మరో 10 నిమిషాల వరకు రైల్వే గేట్ల వద్ద ఇరువైపులా వాహనదారులు బారులుతీరాల్సిందే. రోజుకు 50కి పైగా వివిధ రైళ్లు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నాయి. దీంతో పలుమార్లు గేటు వేస్తూ ఉంటారు. నగరి మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట, సత్రవాడ ప్రాంతాల్లోని వాహనదారులు, స్థానికులకు ఏకాంబరకుప్పం రైల్వే గేటు నిత్య నరకం చూపిస్తోంది. చిత్తూరు, బెంగళూరుతో పాటు తమిళనాడుకు వెళ్లడానికి ఈ మార్గం ఉపయోగపడుతుండడంతో ఎక్కువగా వాహనాలు ఇటువైపుగా వెళుతుంటాయి. నేత వృత్తిని కొనసాగించే ప్రధాన ప్రాంతాలన్నీ ట్రాక్‌కు అవతలి వైపు ఉండడంతో లోయర్ ట్రాక్‌లో ట్రైన్ వచ్చే సమయంలో గేటు వేస్తే రోడ్డుపై కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోతాయి. గేటు తెరిచే సమయంలో అప్పర్ ట్రాక్‌కు సంబంధిత అండర్ బ్రిడ్జి నుంచి వాహనాలు వెళ్లాల్సి వస్తుంది. అండర్ బ్రిడ్జి వెడల్పు తక్కువగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. చెరకు క్రషింగ్ సమయంలో చెరకు లోడుతో వెళ్లే ట్రాక్టర్లు బ్రిడ్జి కింద ఇరుక్కుపోయిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి సమయాల్లో రోడ్డుపై చాలా దూరం వరకు వాహనాలు ఆగిపోతాయి. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర అత్యవసర పనులతో ప్రయాణించే వారికి ఈ రైల్వే గేటు వద్ద ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడం ఇబ్బందులకు గురిచేస్తోంది. గేటుకు అవతల కల్యాణ మండపాల్లో వివాహాలు జరిగే సమయంలో ఈ ఇబ్బందులు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించలేము. ఇంత రద్దీగా ఉండే ఈ లెవెల్ క్రాసింగ్ వద్ద అండర్‌బ్రిడ్జి నిర్మాణం చాలా అవసరమని అధికారులు గుర్తించినా కార్యాచరణకు నోచుకోలేదు. పలుమార్లు రైల్వే, రోడ్లు భవనాల శాఖ అధికారులు ఈ ప్రాంతంలో ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పరిశీలనలు చేశారు. అయితే పనులు ముందుకు కదలకపోవడంతో స్థానికులు ఈ గేటు కష్టాలు ఇంకెన్నాళ్లు భరించాలో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లోతట్టులో పాత అండర్ బ్రిడ్జి

ప్రస్తుతానికి లోతట్టుగా చిన్న అండర్ బ్రిడ్జి ఉన్నా వాహనలు వెళ్లడానికి వీలుపడటం లేదు. ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు వీలున్నా వర్షాలు పడే సమయంలో బురదతేలిపోవడంతో వాహనాలు అటువైపుగా వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే.


అధ్వాన్నంగా ఉన్న అండర్ బ్రిడ్జి

అరగంట ఆగాల్సిందే



మా ప్రాంతానికి వచ్చే మార్గంలో ఉన్న రైల్వే గేటు మూస్తే, అరగంట వరకు అక్కడ వాహనాలు ఆగాల్సిందే. రైలు గేటుదాటేంత వరకు ఇబ్బందులు తప్పవు. ఒక్కోసారి రెండు మూడు రైళ్లు వస్తే అరగంటకుపైగా నిరీక్షించాల్సిందే. దీని వల్ల వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. అండర్ బ్రిడ్జి నిర్మాణంపై పలుమార్లు చర్చలు జరుగుతున్నా రైల్వేశాఖ దానిని కార్యాచరణలో పెట్టడం లేదు.

–మునిరత్నం, టీచర్, ఏకాంబరకుప్పం

క్లుప్తంగా

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నింద్ర: ఖరీఫ్‌లో వరి సాగు చేసిన పంటలకు ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మండలంలోని అగరం, నింద్ర గ్రామల్లో బుధవారం వరి పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ చర్యలు పాటించి, తప్పనిసరిగా పిచికారీ చేయాలని కోరారు. వరిలో లద్దిపురుగులను నివారణ చేపట్టాలని కోరారు.

ఉపాధి పనులపై సమీక్ష


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ సతీష్

పాలసముద్రం: మండలంలో ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా చేయాలని ఎంపీడీఓ సతీష్ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏపీఓ మార్గరెట్, ఉపాధి సిబ్బందితో ఎంపీడీఓ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పండ్లతోట పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా కూలీల సంఖ్య పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈసీ రామమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీకాలతో రక్షణ


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: టీకాలతో ప్రాణాంతక వ్యాధులు నుంచి రక్షణ కలుగుతుందని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. చిన్నారులకు టీకాలు వేశారు. వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులు క్రమం తప్పకుండా వేసుకోవాల్సిన టీకాల గురించి తెలియజేశారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే బిడ్డకు ఇవ్వాలన్నారు. ఏడోనెల నుంచి శిశువుకు అనుబంధ ఆహారం పెట్టాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు సుశీల, మురళి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం


విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయస్వామి దేవస్థాన గో సంరక్షణ ట్రస్టుకు బుధవారం ఓ దాత నగదు విరాళం సమర్పించారు. తిరుపతికి చెందిన పంచజయన్ రూ. ఒక లక్ష నగదు విరాళంగా ఇచ్చుకున్నారు. ఆ నగదును ఆలయ ఏఈవో రవీంద్రబాబుకు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ అధికారులు దర్శనభాగ్యం కల్పించారు.

నోటీస్ బోర్డు

ఆశా వర్కర్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

పాలసముద్రం: మండలంలోని వనదుర్గాపురం, వెంగళరాజుకుప్పం పంచాయతీలో ఆశా వర్కర్‌గా ఉద్యోగానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని బుధవారం పీహెచ్‌సీ డాక్టర్ మోహన్‌క్రిష్ణ తెలిపారు. అభ్యర్థులు పదో పతరగతి పాసై ఉండాలని, పంచాయతీ పరిధిలోని నివసించేవారు అర్హులన్నారు. వయస్సు 25 నుంచి 45 లోపు ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పశువులకు వ్యాధి నివారణ చర్యలు

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి సంధ్య అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. టీకాలు వేసుకోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాడి ఆవులకు పాల దిగుబడి తగ్గడం, జ్వరం, చొంగ కారడం, కుంటడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యసేవలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ క్వారీలను రద్దు చేయాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నగరి: మండలంలోని అక్రమ క్వారీలను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ క్వారీలను అనుమతి ఇవ్వాలంటే గ్రామసభ పెట్టి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని అయితే ఆ పద్ధతులను అధికారులు పాటించడం లేదన్నారు. విచ్చలవిడిగా గ్రావెల్ అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. రెవెన్యూ అధికారులు ఎన్‌ఓసీ ఇచ్చే సందర్భంగా గ్రామ సమస్యలపై గ్రామ సభ నిర్వహించి ప్రజాభిప్రాయాలను సేకరించి తరువాత గ్రామస్తుల ఇబ్బందులను వారి సమస్యలను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి తరువాత క్వారీలకు అనుమతివ్వాలన్నారు. వ్యవసాయ భూములకు తాగునీటికి, మేకలు, ఆవులు, బర్రెలు, గొర్రెల మేతకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ గుండ్రాజుకుప్పం గ్రామంలో గ్రామసభ నిర్వహిస్తామన్నారు. మైన్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు హాజరై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, నగరి పట్టణ నాయకులు సుబ్రహ్మణ్యం, మధు, బాబు, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మా ఊరి బడే కావాలి!

- 3.కి.మీ. దూరం ఉన్న స్కూల్‌కు వెళ్లలేం


పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

శ్రీరంగరాజపురం : మా పాఠశాల మాకు కావాలి అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు మండలంలోని పెద్దతయ్యూరు ప్రాథమిక పాఠశాల పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల కథనం మేరకు.. పెద్దతయ్యూరు దళిత వాడలో పాఠశాలలో దాదాపు 30 మంది విద్యార్థులు ఉన్నారు. తల్లిదండ్రుల అనుమతి లేకుండా మా పాఠశాలలో ఉన్న విద్యార్థులను 3 కి.మీ. దూరంలో ఉన్న 50 బసిరెడ్డిపల్లి పాఠశాలకు తరలించడం ఎంత వరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. విలీనం అయిన 50 బసిరెడ్డిపల్లి పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని, అక్కడ వసతులు లేవని వాపోయారు.

గంగజాతరలో మాజీ మంత్రి ఆర్కే రోజా



జాతరలో మాజీ మంత్రి ఆర్కేరోజా, గంగమ్మను దర్శించుకుంటున్న రోజా

నగరి: మున్సిపాలిటీలోని కాకవేడులో వైభవంగా జరిగిన గంగమ్మ జాతరలో మాజీ మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. జాతర నిర్వాహకులు ఆమెకు సాదరంగా ఆహ్వానం పలికారు. అమ్మవారికి హారతులిచ్చి దర్శించుకున్న రోజాకు నిర్వాహకులు ఆలయ ప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, మునివేలు, రాజముత్తు, చిన్నదొరై, మురుగ, మోహన్‌రాజ్, ఆనంద్ పాల్గొన్నారు.

గంగమ్మా..చల్లంగా చూడమ్మా!

వడమాలపేట (విజయపురం): వడమాలపేట పత్తిపుత్తూరులో గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి జాతర ప్రారంభమైంది. బుధవారం ఉదయం మాజీ మంత్రి ఆర్కే రోజా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. ఏడాదికోసారి మాత్రమే లభించే గంగమ్మ విశ్వరూపం దర్శనాన్ని చేసుకుని రాష్ట్రాన్ని గంగమ్మ చల్లంగా చూడాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట సురేష్‌రాజు, లోకేష్ రెడ్డి, భరత్ కుమార్, చంద్రారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ


దుర్యోధన వధ్ద ఘట్ట ప్రదర్శనలో తలపడుతున్న భీమ, దుర్యోధన వేషధారులు

పెనుమూరు(కార్వేటినగరం): పర్యాటక కేంద్రమైన పులిగుండు వద్ద ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథాగానం చేశారు. అనంతరం దుర్యోధన వధ ఘట్టం ప్రదర్శించారు. గంగమడుగులో దాగిన దుర్యోధనుని భీమసేనుడు వెలికి తీసుకువచ్చి హతమార్చే ఘట్ట ప్రదర్శనను కళాకారులు రక్తి కట్టించారు. ఒకరిపై మరొకరు కలియబడుతూ, పద్యాలు ఆలపిస్తూ భక్తులను ఆకట్టుకున్నారు. ఈ ఘట్టానికి మాజీ సర్పంచ్ మేకల గోవిందరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వధ అనంతరం నిర్వహించిన ధర్మరాజులు పట్టాభిషేకం కార్యక్రమానికి మహాసముద్రం ప్రతాపరెడ్డి, మహాసముద్రం సురేష్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలతారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామి యాదవ్, కారేటి గోవిందరెడ్డి, కంచర్ల చక్రవర్తినాయుడు, పలువురు పాల్గొన్నారు.

రసాయన నీటితో రైతుల కష్టాలు


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

నగరి: రసాయన రంగు నీటి కారణంగా చెరువులు కలుషితమై తాము పడుతున్న బాధలను అర్థం చేసుకోవాలని బాధిత రైతులు ఆర్డీవో భవానీ శంకరికి బుధవారం వినతిపత్రం అందజేశారు. నగరి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధర్వంలో ఆర్డీవోను కలిసిన వారు మాట్లాడారు. జీరో డిశ్చార్జ్ ద్వారా నడుపుతున్నటువంటి డైయింగ్ యూనిట్లను పారిశ్రామిక వాడలకు తరలించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రసాయన రంగునీటి కారణంగా గ్రామాల్లో పడుతున్నటువంటి అవస్థలను, సాగు కష్టాలను క్షుణ్ణంగా వివరించారు. దీనిపై ఆర్డీవో సమాధానమిస్తూ డైయింగ్ యూనిట్లను ఒకే ప్రాంతానికి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం రంగు నీటిని బయట విడుదల చేస్తున్నవారిపై కూడా నిఘా ఉంచి వెంటనే చర్యలు తీసే విధంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారితో చర్చిస్తామన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

నింద్ర: మండలంలో గృహ నిర్మాణ పనులను బుధవారం మండలంలోని ఆరూరు, కావునూరు గ్రామాల్లో ఎన్‌టీఆర్ గృహ నిర్మాణాలను ఏఈ శ్రీధర్ రాజు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. పూర్తి చేసిన వారికి బిల్లులు సకాలంలో అందించనున్నట్లు చెప్పారు. పనులు పూర్తి చేసి బిల్లులు పొందాలని అయన అన్నారు. నూతన గృహ నిర్మాణాలు కూడా అర్హతలైన వారికి నమోదు చేస్తామన్నారు.

మామిడి పుష్కలం రైతుకు నిష్ఫలం


ర్యాంపుల వద్ద తమిళనాడుకు తరలించడానికి నిల్వ ఉంచిన మామిడి కాయలు

- ర్యాంపుల వద్ద ఇష్టారాజ్యంగా ధరల నిర్ణయం
- క్రషింగ్ పూర్తయ్యే వరకు నో పర్మిట్ అంటున్న యాజమాన్యాలు

తవణంపల్లె: మామిడి రైతుల గుండెల్లో మంటలు రేగుతున్నాయి. కాయలను ఫ్యాక్టరీలకు తరలించడానికి రైతులు ఫ్యాక్టరీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించడం లేదు. మండలంలో నాలుగు ఫ్యాక్టరీల్లో క్రషింగ్ జరుగుతోంది. రెండు వారాలుగా ఫ్యాక్టరీ యజమానులు అనుకూలమైన వారికి పర్మిట్లు ఇవ్వడంతో మామిడి కాయల ట్రాక్టర్లతో నిండిపోయాయి. కానీ ఫ్యాక్టరీ యజమానులు ధరలు నిర్ణయించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. వారం రోజులుగా పర్మిట్ల కోసం రైతులు ఫ్యాక్టరీల దగ్గర అన్నంలేక ఆకలితో పడిగాపులు కాస్తున్నారు. మామిడి తోటల్లో కాయలు మచ్చలు పడి రాలిపోతున్నా పర్మిట్లు ఇవ్వడం లేదు. ఫ్యాక్టరీల వద్ద మామిడి కాయల లోడ్లతో ఉన్న ట్రాక్టర్లు కిలోమీటర్ల మేర బారులు తీరి ఉన్నాయి. కాయలు అన్‌లోడ్డు చేయడానికి 36 నుంచి 48 గంటలు పడుతోంది. ర్యాంపుల దగ్గర రైతులు ఎలాగైనా మామిడి కాయలు అమ్మక తప్పదని భావించిన కొనుగోలుదారులు బుధవారం కిలో కాయలను రూ.2.25 నుంచి రూ.2.50కు కొనుగోలు చేస్తామని లేకుంటే ఇక్కడి నుంచి వెళ్లిపోవచ్చని తెలిపారు. చేసేది లేక రైతులు కొందరు మనసు చంపుకుని అమ్మేసి వస్తున్నారు. మరికొందరు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తాం

ప్రభుత్వం మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటుందని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు ప్రకటించారు. మండలంలోని దిగువమాఘం సచివాలయంలో మామిడి రైతులతో సమీక్షించారు. రవికుమార్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం మామిడి కాయలను కిలోకు రూ.4లు సబ్సిడీ తప్పక ఇచ్చి ఆదుకుంటుదన్నారు. ఫ్యాక్టరీ యజమానులతో మాట్లాడి కిలోకు రూ.8 ఇప్పిస్తామన్నారు. సీఈఓతో పాటు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, సర్పంచ్ గోపి, రైతులు పాల్గొన్నారు.




దిగువమాఘంలో రైతులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, గాజులపల్లె సమీపంలో ర్యాంపుల వద్ద లారీలకు లోడ్లు చేస్తున్న మామిడి కాయలు, ఎఫ్-3 ఫ్యాక్టరీలో బొలేరో వాహన బరువు చూస్తున్న సిబ్బంది

రేషన్ ధరల పట్టికేది బాబూ..?

పాలసముద్రం: మండలంలోని ఏడవ నంబర్ రేషన్ షాపు ఎదుట ఏర్పాటు చేసిన నేమ్ బోర్డులను చూసి రేషకార్డుల లబ్ధిదారులు ఇదేమి బోర్డురా బాబూ అంటున్నారు. చౌక దుకాణం ఎదుట నిత్యావసర వస్తువుల ధరల పట్టిక బోర్డు, పంపిణీ చేసే వేళల వివరాలు అందులో ఉండాలి. తాగునీటి వసతి కల్పించాలి. అయితే 7వ నంబర్ రేషన్ షాపులో డీలర్ ఫొటో, ప్రజాప్రతినిధుల ఫొటోలు పెట్టడం గమనార్హం! సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి నిత్యావసర సరకుల ధరల పట్టిక బోర్డు ఏర్పాటు చేయించాలని పలువురు కోరుతున్నారు.


షాపు ఎదుట డీలర్, ప్రజాప్రతినిధుల చిత్రాలతో ఏర్పాటు చేసిన బోర్డు